క్లుప్తంగా

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న చిన్నారులు

పాలకొండ రూరల్: పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి సంబరం నిర్వహించగా..చిన్నారులు ఎంతో హుషారుగా పాల్గొన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది టి.సుబ్రహ్మణ్యం, కె. పద్మజ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఓ మృతి



వీఆర్‌ఓ కామేశ్వరరావు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు వీఆర్‌ఓగా పనిచేస్తున్న పిట్ట కామేశ్వరరావు(39) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. కొమరాడ మండలంలోని దుగ్గి గ్రామానికి చెందిన కామేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన మృతిపై గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ ఎన్.శేఖర్‌తో పాటు మండలంలోని వీఆర్‌ఓలు సంతాపం వ్యక్తం చేశారు.

రెండు వారాలకు మించిన దగ్గు టీబీ కావొచ్చు



మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ ప్రశాంత్

సాలూరు: ఎవరిలోనైనా రెండు వారాలకు మించి దగ్గు ఉంటే అది టీబీ(క్షయ) కావచ్చని, వెంటనే వైద్యుడిని సంప్రదించాలని డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన గురువారం సందర్శించి, కాసేపు మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి వ్యక్తికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి టీబీ పేషెంట్‌కు మందులు వాడుతున్నంత కాలం నెలకు రూ.1000 చొప్పున అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు డా.ప్రియాంక, టీబీ సూపర్‌వైజర్ నరేష్ పాల్గొన్నారు.

అక్రమంగా పశువుల తరలింపు

సాలూరు రూరల్: సాలూరు మీదుగా మానాపురం సంతకు ప్రతి వారం పశువులను అక్రమంగా తరలిస్తున్నారు. చిన్న చిన్న వాహనాల్లో భారీ కాయం(శరీరం) కలిగిన ఆవులు, గేదెలను రవాణా చేస్తున్నారు. మామిడిపల్లి, సాలూరు మీదుగా నాలుగు వ్యాన్‌లతో గేదెలను గురువారం తరలించారు. ఆ వ్యాన్‌ల డ్రైవర్లను ఎక్కడి నుంచి ఎక్కడకు వీటిని తరలిస్తున్నారని స్థానికులు ప్రశ్నించగా, కుందిలి నుంచి మానాపురానికి అని వారు సమాధానం చెప్పారు.

నేత్ర శస్త్రచికిత్సకు 22 మంది ఎంపిక



రోగులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 22 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు ఆప్తాలమిక్ అధికారి గణేష తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఈర్ల సంజీవ నాయుడు సహకారంతో అల్లు నారాయణమ్మ జ్ఞాపకార్థం అల్లు సత్యం ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం సత్యసాయి మందిరం వద్ద నిర్వహించారు. మొత్తం 38 మంది కళ్లను తనిఖీ చేసుకునేందుకు రాగా వారిలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతూ ఆపరేషన్ అవసరమైన 22 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ ఉచితంగానే ఆపరేషన్లు చేసి, మందులు అందివ్వడం జరుగుతుందన్నారు.

'ఉపాధి' కార్మికుల హక్కులపై అవగాహన

సీతానగరం: మండంలోని ఏగోటివలస గ్రామంలో ఉపాధి హామీ పథకం, కార్మికుల హక్కులపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఐఈసీ(ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యునికేషన్) బృందాల ద్వారా సర్పంచ్ యు.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం, వేతనదారుల హక్కులను ప్రజలకు తెలియజేశారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఉపాధి పొంది, జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని ఎస్‌ఆర్‌పీ దాసు తెలిపారు.

పేదలకు పౌష్టికాహారం దూరం..

- కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ
- నాడు ఇంటి వద్దకే సేవలు...నేడు రేషన్ కోసం అవస్థలు



సీతంపేట మండలంలో డిపో వద్ద వేచి ఉన్న గిరిజనులు (ఫైల్)

పాలకొండ రూరల్: పేదలకు పట్టెడన్నం అందించేందుకు అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ లోపభూయిష్టంగా మారింది. ఏజెన్సీల మిళితమైన నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలు, గిరిజనులకు చౌకడిపోల ద్వారా మెరుగైన ఆహార సరుకులు అందించే క్రమంలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ సరుకులు పొందాలంటే వ్యయప్రయాసలు తప్పడం లేదు. ముఖ్యంగా రేషన్ డిపోల వద్దకు వచ్చే వృద్ధులు, మహిళలు గంటల సమయం పడిగాపులు కాయాల్సివస్తోంది. ఎత్తైన కొండలపై జీవనం సాగించే గిరి పుత్రులు నేడు రేషన్ పొందాలంటే కొండలు దిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది.

అరకొర సరుకులతో మమా...

దారిద్ర్య రేఖకు దిగువ ఉండే కుటుంబాలకు పౌష్టిక విలువలతో కూడిన సరకులు నాడు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటివద్దనే అందజేసింది. అప్పట్లో తెల్లకార్డు లబ్ధిదారుకు ఐదు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో గోధుమ పిండి, అరకిలో చక్కెర, కోవిడ్ సమయంలో కొమ్ము శనగలు అందించారు. అలాగే బియ్యం వద్దనుకునే వారికి మూడు కిలోల రాగులు అందించారు. నేటి కూటమి ప్రభుత్వంలో బియ్యం, చక్కెర మినహా మిగిలిన సరుకులకు మంగళం పాడేశారు. సామాన్య కుటుంబీకుడు పట్టెడు పప్పన్నం తిందామన్నా అవకాశం లేదు. కిలో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.120, కొమ్ము శనగలు రూ.80, రాగులు రూ.50, గోధుమపిండి 40 రూపాయలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

సమున్నత లక్ష్యంతో..

ఎత్తైన కొండలపైనున్న గ్రామాలకు సరుకులు చేరవేసేందుకు నాడు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో ఏర్పాట్లు చేసింది. ఈక్రమంలో నిరుద్యోగులకు రేషన్ బట్వాడా చేసేందుకు మినీ ట్రక్కులను రిజర్వేషన్ ప్రాతిపదికన అందించారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాలకు సంబంధించి 54 మినీ ట్రక్కులు సమకూర్చారు. కోవిడ్ మహమ్మారి పంజా విసిరిన కష్ట సమయంలో ప్రజలు నిత్యావసర సరుకులు కొనుక్కునేందుకు బయటకు రాలేని పరిస్థితి. ఈ సమయంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే రేషన్ అందించారు.



వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధిదారుల వద్దకు వెళ్లి రేషన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

నేడు అధ్వానం..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎండీఎం వాహనాలను రద్దు చేయడంతో లబ్ధిదారులందరూ డిపోల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొండలపై నున్న వారు కిలోమీటర్ల కొద్దీ నడుచుకుంటూ మైదాన ప్రాంతాలకు వచ్చి సరుకులు విడిపించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

బియ్యం, చక్కెర మాత్రమే..



రేషన్ బట్వాడా వాహనాలు నిలిపేశారు. గతంలో కందిపప్పు, గోధుమ పిండి, కొమ్ము శనగలు, బియ్యం వద్దనుకుంటే రాగులు ఇచ్చేవారు. ఇప్పుడు బియ్యం, చక్కెర మినహా మరేమీ ఇవ్వడం లేదు. – తొర్లపాటి నీరజ, సర్పంచ్, నవగాం, పాలకొండ మండలం

ప్రజల సమస్యలు పట్టడం లేదు..

కూటమి ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టడం లేదు. ఒక్క సంక్షేమ పథకమూ అమలు చేయడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే సరుకుల్లో కోత విధించారు. బియ్యం, చక్కెర కోసం కొండలమీదుండే గిరిజనులు అష్టకష్టాలు పడి మరీ డిపోల వద్దకు రావాల్సి వస్తోంది.

విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యంలో ఉన్నామా..!

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



పాలకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు చూస్తుంటే అస్సలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అన్న సందేహం కలుగుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. జెడ్పీటీసీ ఎన్నిక కోసం ఇంత దారుణంగా వ్యవహరించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ ఎన్నో దౌర్జన్యాలు చేసిందని ఆరోపించారు. దొంగ ఓట్లు వేయించి ప్రజాసామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. పోలీసులు, అధికారులు టీడీపీ అనుకూలంగా పనిచేసి వైఎస్సార్ సీపీ ఏజెంట్లుగా లేకుండా చేశారన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను ఎన్నికల సంఘానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలియజేస్తారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోని టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామాన్ని ఖూనీ చేసిందని మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి ఆరోపించారు. వండువలోని ఆమె స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ.. అప్రజాస్వామిక విధానంలో రిగ్గింగ్ చేసి గెలిచినా...ఈ గెలుపు ఓటమితో సమానమన్నారు. ప్రభుత్వ పెద్దల జోక్యంతో అడ్డుగోలుగా ఇక్కడ జరిగిన ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందుల ప్రజలను భయభ్రాంత్రులకు గురి చేసి, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను పోలింగ్ బూత్‌లకు రానీయకుండా అడ్డుగోలుగా ఎన్నికలు నిర్వహించారన్నారు.

ప్రజలు మోసపోయారు..



కీసరలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: కూటమి నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీల అమలులోనే కాదు ఓటింగ్‌లోనూ మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని కీసరలో పార్టీ నాయకులు తోట సింహాచలం, టింగ అన్నాజీరావు, బోనగడ్డి ధర్మారావు, మజ్జి మోహన్ బాబు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని చంద్రబాబు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారున. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారున. ప్రస్తుతం పులివెందుల, ఒంటిమెట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించి ప్రజాస్వామాన్ని ఖూనీ చేశారని వివరించారు.

ప్రభుత్వం నుంచి ఎరువులు తెప్పించే ప్రయత్నాలలో పోటీ పడకుండా రైతులను మోసం చేయడంలో పాలకులు పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వలరౌతు రామకృష్ణ, వలరౌతు మిన్నారావు, ఎరుకుమజ్జి పాపినాయుడు, శివ్వాల తిరుపతి, పతివాడ రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు

సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది తీరాన వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో భక్తులు స్వామి వారికి ముడుపులు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు. లోక కల్యాణార్థం స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు.



హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో పోస్టుమెట్రిక్ హాస్టల్ విద్యార్థులు గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టుకుని భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. పోస్టు మెట్రిక్ వసతిగృహం సంరక్షణాధికారి సీహెచ్.సాంబమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. దేశ ప్రజలంతా కులాలు, మతాలకు అతీతంగా, భిన్నత్వంలో ఏకత్వంలా మెలగాలని పిలుపునిచ్చారు. రావాడ రోడ్డు వద్ద మానవహారంగా ఏర్పడ్డారు.

సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన



సవర దిమ్మిడిజోలలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్న సబ్‌కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్

భామిని: పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ భామిని మండలంలో గురువారం సుడిగాలి పర్యటన చేశారు. తహసీల్దార్ శివన్నారాయణ, ఎంపీడీఓ వసంతకుమారితో కలిసి సవర దిమ్మడిజోల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. దగ్గరుండి పాఠాలు చదివించారు. ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ లేకపోవడాన్ని గుర్తించారు. అనంతరం లోవగూడలో పీఎం జన్‌మన్ గృహాలను పరిశీలించి అందుతున్న బిల్లులపై ఆరా తీశారు. భామిని జీసీసీ డిపోను సందర్శించగా డిపోకు తాళాలు వేసి ఉండడంతో అంసతృప్తి వ్యక్తం చేశారు. బత్తిలిలో డిపోను సందర్శించి సరుకుల పంపిణీ, స్టాక్‌లు సక్రమంగా ఉండడాన్ని గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం భామిని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రీ సర్వేపై సూచనలు చేశారు. డీటీ శంకరనాయుడు, ఆర్‌ఐ మణి ప్రభాకర్, సర్వేయర్ రాజేశ్వరరావు ఉన్నారు.

పంచాయతీ నిధులపై దర్యాప్తు



గ్రామస్తులతో సమావేశమైన డీపీఓ కొండలరావు

కొమరాడ:

స్థానిక పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని మండల కేంద్రానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ కొండలరావు కొమరాడ సచివాలయంలో సర్పంచ్, గ్రామస్తుల సమక్షంలో గురువారం దర్యాప్తు నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్లుచ తాగునీరు, మోటార్ల నిర్వహణ తదితర ఖర్చుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని, నివేదికను కలెక్టర్ సమర్పిస్తామని పేర్కొన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి



బత్తిలిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

భామిని: ప్రతి ఒక్కరూ మత్తుకు దూరంగా ఉండాలని ఎస్సై జి. అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు నిషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బత్తిలి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సీతంపేట: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వై.అమ్మన్నరావు అన్నారు. గురువారం స్థానిక అడ్వంచర్ పార్కు వద్ద 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్, రహదారి ప్రమాదాలపై గురువారం అవగాహన కల్పించారు. రహదారి భద్రతా నియమాలు పాటించడంతో పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకోండి



ప్రిన్సిపాల్‌కు సూచనలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. గురువారం స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా తరగతి గదులు, డార్మెటరీలను పరిశీలించారు. వర్షాలకు కారిన గదుల్లో విద్యార్థులను ఉంచవద్దన్నారు. చిన్న చిన్న మరమ్మతులను వెంటనే బాగు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న గ్రామసింహాలు



స్థానిక ఏరియా ఆస్పత్రి రహదారిలో శునకాలు

పాలకొండ రూరల్: పట్టణంలో శునకాల హడావిడి ఎక్కువైంది. వీధుల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతూ పాదచారులను భయపెడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే పాలకొండ ఏరియా ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు కోరినా ఎవ్వరూ పట్టించుకోలేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

సీతంపేట: మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని మండలంలోని కొత్తకోట జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని, అతని నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు దోనుబాయి ఎస్సై మస్తాన్ తెలిపారు. నిందితుడు డి. వెంకటరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

● జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న వీరఘట్టం గాయత్రీ కళాశాల విద్యార్థులు

వీరఘట్టం: పట్టణ వీధులన్నీ గురువారం త్రివర్ణ శోభితమయ్యాయి. శుక్రవారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గాయత్రీ విద్యాసంస్థల విద్యార్థులు 500 అడుగుల భారీ జాతీయ పతాకంతో పట్టణ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. భారత్ మాతాకీ జై అంటూ చేసిన నినాదాలతో ప్రతీ మది దేశభక్తితో ఉప్పొంగింది. ముచ్చటైన మూడు రంగులు, అశోక చక్రంతో ప్రజ్వరిల్లినట్లు ఉన్న జాతీయపతాకాన్ని తిలకించిన స్థానికుల గుండెలు ఉప్పొంగాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పాలకొండ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ చేపట్టారు.

వ్యాధులపై అవగాహన అవసరం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో విస్తరించే వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆయుర్వేదం, హోమియో వైద్యులు పావనీవిద్యహే, ఆదిలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయుర్వేదం,హోమియో ద్వారా మొండి రోగాలను సైతం నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు నందిని సాయి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.